ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కరీంనగర్

జిల్లా వార్తలు

5

సోమవారం 1 జూలై 2024


పెద్దమ్మతల్లికి బోనాలను సమర్పించేందుకు భారీ సంఖ్యలో వెళ్తున్న మహిళలు

బోనమో పెద్దమ్మ తల్లి

కరీంనగర్ కల్చరల్, జూన్ 30: నగరంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాల జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కట్టరాంపూర్, భగత్‌నగర్, బోయివాడతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు బోనాలతో తరలి వచ్చి భగత్‌నగర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, తోట రాములు, రాష్ట్ర ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు బండ ప్రకాశ్, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గుర్రాల మల్లేశం, రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొలకాని నరసయ్య, పండుగ నాగరాజు, ఉపాధ్యక్షులు కంకటి కనకయ్య, ఎలవేని నరసయ్య, సంయుక్త కార్యదర్శి గీకురు నారాయణ, ప్రచార కార్యదర్శి కంకటి శ్రవణ్, కనకచంద్రం, గరిగె కోటేశ్వర్ పాల్గొన్నారు.

'కోమటిరెడ్డి', శారద పదవులు పదిలం



- నామినేటెడ్ పదవులకు గ్రీన్‌సిగ్నల్
- త్వరలో మళ్లీ ఉత్తర్వుల జారీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్‌సభ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన 37 నామినేటెడ్ పోస్టులకు కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోద ముద్ర వేసింది. ఒకటి రెండు రోజుల్లో ఆయా పోస్టుల్లో నియమితులైన వారికి మళ్లీ ఉత్తర్వులు అందనున్నాయని సమాచారం. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురు మంత్రివర్గ సహచరులతో కలిసి ఢిల్లీకి వెళ్లి రాష్ట్ర కేబినెట్ విస్తరణ, టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, ఇప్పటికే జారీ చేసి పెండింగ్‌లో ఉంచిన నామినేటెడ్ పదవుల వ్యవహారంపై జాతీయ నాయకులతో చర్చించారు. ఈ మేరకు నామినేటెడ్ పదవుల్లో నియమించిన వారందరిపై సానుకూలత వ్యక్తం చేస్తూ వారి నియామకాలకు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. దీనితో నామినేటెడ్ పదవులు పొందిన జిల్లాకు చెందిన ఇద్దరు కాంగ్రెస్ నేతలకు ఊరట లభించింది.

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివిధ కార్పొరేషన్లు, మహిళా కమిషన్, శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా) మొదలగు 37 సంస్థలకు చైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరికి రాష్ట్ర నాయకత్వం నుంచి ఫోన్ ద్వారా వ్యక్తిగతంగా సమాచారం అందించారు. వీరిలో సుడా చైర్మన్‌గా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నేరెళ్ల శారద పదవులు పొందారు. ఎలక్షన్ కోడ్ అమల్లో రావడంతో వీరు ఆయా పదవులను చేపట్టలేదు. ఈలోగానే ఈ రెండు నియామకాలపై జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ తనను సంప్రదించకుండా తమ జిల్లాలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంపై అసంతృప్తిని, అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. వివిధ ప్రాంతాల్లో కూడా ఆయా ప్రాంత నేతలు ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేయడంతో ఎన్నికల కోడ్ ముగిసినా వారిని పదవులు చేపట్టవద్దని సూచించారు. వివిధ జిల్లాల్లో కరీంనగర్ జిల్లా మాదిరిగానే నియామకాలపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వీటిని రద్దుచేసి మళ్లీ కొత్తగా నియామకాలు చేపడతారని, వీరిలో కొందరినైనా మార్చే అవకాశం ఉంటుందని భావించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజా ఢిల్లీ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిలతో భేటీ అయి ఈ నియామకాలపై చర్చించి అధిష్ఠానాన్ని మెప్పించి ఆమోదముద్ర వేయించుకున్నారని సమాచారం. ఈమేరకు త్వరలోనే మళ్లీ నియామక ఉత్తర్వులు వెలువడతాయని తెలిసింది.



మార్చి వరకు స్మార్ట్ సిటీ మిషన్ పొడిగింపు

భగత్‌నగర్, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ మిషన్‌ను దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాల్లో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్మార్ట్ సిటి నిధులను దారి మళ్లించడం వల్లే కరీంనగర్‌లో అభివృద్ధి కుంటు పడిందన్నారు. గతంలో నేతలు కాంట్రాక్టర్ వద్ద కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారని, కాంగ్రెస్‌లోనూ కొందరు ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారన్నారు.

తక్షణమే స్మార్ట్‌సిటీ నిధుల అవతవకలు, కమీషన్ల బాగోతంపై విచారణ చేపట్టాలన్నారు. స్మార్ట్‌సిటీ నిధులను విడుదల చేయాలని గతంలో తాను మూడు సార్లు లేఖ రాశానన్నారు. కరోనా వల్ల రెండేళ్ల కాలం వృథా కావడంతో స్మార్ట్‌సిటీ మిషన్‌ను పొడగించాలని కోరామన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వచ్చే మార్చి నెలాఖరువరకు పొడిగించినందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం తన వాటా కింద మ్యాచింగ్ గ్రాంట్ నిధులను సకా లంలో మంజూరు చేసి అభివృద్ధికి సహకరించా లన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌లో నిలదీసిన తరువాత కేంద్ర నిధులను జమ చేశారన్నారు. గత పాలకులు స్మార్ట్‌సిటీ పనుల్లో కమీషన్ల కోసం కక్కుర్తిపడడంతోనే పనుల్లోజాప్యం జరిగిందన్నారు. స్మార్ట్‌సిటీ మిషన్‌ను దేశవ్యాప్తంగా పొడగించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు కృత్యజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఎ'లో చేర్చాలి

సుభాష్‌నగర్, జూన్ 30: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ 'డి' నుంచి బీసీ 'ఎ'లో చేర్చాలని శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ అన్నారు. ఆదివారం నగరంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యవర్గ దశాబ్ది సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిందని, ఎన్నో జీవోలను తెచ్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించాలన్నారు. నీటి విస్తీర్ణంతో సంబంధం లేకుండా, 18 సంవత్సరాలు పూర్తయిన వారికి మత్స్యకారులుగా సభ్యత్వం ఇవ్వాలన్నారు. కుల గణన చేపడితే ముదిరాజ్‌ల జనాభా శాతం తెలుస్తుందని, తద్వారా బీసీ కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు అధిక స్థానాల్లో గెలవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, రాష్ట్ర ప్ర. దాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య, రాష్ట్ర యువత అధ్యక్షుడు పండుగ బాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి గీకురు రవీందర్, జిల్లా ఫిషరీస్ చైర్మెన్ పిట్టల రవీందర్, బండారి భూమేశ్, బండారి నరేందర్, కొలిపాక మల్లికార్జున్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్

- కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, జూన్ 30: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్ బాటలోనే నడుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో బీజేపీ ఎమ్మె ల్యేలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపడం దుర్మార్గ మన్నారు. అన్ని పార్టీల ఎమ్మెల్యేలు ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచిన విషయం మరిచి పోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులిస్తోందని, బీజేపీ ఎమ్మెల్యే లకు ఇవ్వడం లేదన్నారు. ఆయా నియోజకవర్గాల్లో కాం గ్రెస్ అభ్యర్థులను నియోజక వర్గ ఇన్‌చార్జిలుగా పెట్టి నిధులిస్తోందని, ఇది సరికాదన్నారు. కేంద్రంలో అధికా రంలోఉన్న బీజేపీ ప్రభుత్వం అలా చేస్తే తెలంగాణ పరి స్థితి ఏమిటని ప్రశ్నించారు. టీ 20 వరల్డ్‌కప్ భారత్ గెలవడంపై హర్షం ప్రకటించారు.


తిమ్మాపూర్ మండలం కొత్తపలిలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

● దళారీ వ్యవస్థకు మోదీ సర్కార్ వ్యతిరేకం

దళారీ వ్యవస్థకు మోదీ సర్కార్ వ్యతిరేకమని, ఎవరైనా కమీషన్లు తీసుకుంటేచర్యలు తప్పని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దళారులను హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లో పీఎం విశ్వకర్మ యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలు వినతి పత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కొంత మంది దళారులు పీఎం విశ్వకర్మపథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి దళారులను ఉపేక్షించేది లేదన్నారు. ఏదైనా ఇబ్బంది ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకు రావాలన్నారు నిబంధనల పేరుతో లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టవద్దన్నారు.

● తల్లి పేరిట ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటండి

తిమ్మాపూర్: భారత ప్రదాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ సందర్భంగా పర్యావరణం, మొ క్కలు నాటడంపై ప్రధానంగా మాట్లాడారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తల్లికి ఉన్న అత్యున్నత స్థానాన్ని గొప్పగా వివ రించారని, ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఓ చెట్టు నాటాలని ప్రధాని పిలుపునిచ్చా రన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాద్యతగా తల్లి పేరిట ఓ మొక్కను నాటాలని కోరారు. మండలంలోని కొత్తపల్లిలో ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ పేద, ధనిక అనే తేడా లేకుండా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన భాద్యతలను ప్రధాని మన్‌కీ బాత్‌లో గుర్తు చేశారన్నారు. యోగ దినోత్సవ ప్రాముఖ్యం గురించి ప్రధాని మోడీ అనేక విషయాలను తెలియజేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతం శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- బయో మెడికల్ వ్యర్థాల సెగ్రిగేషన్‌పై ఆరా
- చెడిపోయిన వాహనాలకు మరమ్మతులు
- సీజనల్ వ్యాధుల ప్రబలకుండా 'బల్దియా' ముందస్తు చర్యలు

కరీంనగర్ టౌన్, జూన్ 30: నగరపాలక సంస్థ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించింది. కలెక్టర్ పమేలాసత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ సునీల్‌రావు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై అధికారులు, ఉద్యోగులను అప్రమత్తం చేశారు. పారిశుధ్య పనులను మరింత మెరుగుపరిచేందకు చర్యలు తీసుకుంటున్నారు. సానిటేషన్, ఇంజనీరింగ్, సంబంధిత ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై సలహాలు, సూచనలిచ్చారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కొంత మంది జవాన్లను అంతర్గత బదిలీలు చేసి కొత్త ప్రాంతాలకు వెళ్లి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

● ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు, జరిమానాలు

నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డయోగ్నస్టిక్ సెంటర్లు, ప్రైవేట్ క్లినిక్‌ల నుంచి వెలువడే బయో మెడికల్ వ్యర్థాల సెగ్రిగేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టారు. వారం రోజులుగా నగరపాలక సంస్థ పరిధిలోని పలు హాస్పిటల్స్, క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బయో మెడికల్ వ్యర్థాలను చెత్తతో కలిపి ఇస్తున్నట్లు గుర్తించారు. 18 ప్రైవేట్ హాస్పిటల్స్‌లో తనిఖీలు నిర్వహించి రెండున్నర లక్షల రూపాయల జరిమానా విధించారు. కొందరు జరిమానా ఇచ్చేందుకు ససేమిరా అనడంతో ఆయా హాస్పిటల్స్‌పై చర్యలు తీసుకోవాలంటూ డీఎంహెచ్‌వోకు లేఖ రాశారు. హాస్పిటల్స్, క్లినిక్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్లు, పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బందికి బయో వ్యవర్థాల సెగ్రిగేషన్‌పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చట్ట ప్రకారంగా బయో మెడికల్ వ్యర్థాలను వేరు చేసి సంబంధిత కాంట్రాక్టర్‌కు అప్పగించి వాటిని నిర్వీర్యం చేయించాల ని, లేకపోతే జరిమానాతోపాటు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసు పత్రులు, డయోగ్నస్టిక్, క్లినిక్‌ల నిర్వాహ కులు, యజమానులు వెంటనే మున్సిపల్ చట్టం ప్రకారం అవసరమైన లైసెన్సులు పొంది నిబంధనలను పాటించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హెచ్చరించారు.



● దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు దోమల నివారణ చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మురుగునీరు నిలువ ఉండకుండా చూడాలని, ఖాళీ ప్లాట్లు, నివాస స్థలాల మధ్య మురుగునీటి కాలువలు లేక ఉన్న కచ్చానాలల్లో నిలిచిన నీళ్లలో ఆయిల్ బాల్స్, గంబోసియా చేపపిల్లలను వదలాలని కమిషనర్ ఆదేశించడంతో వాటికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో, సెల్లార్లలో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ నోటీసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● రోజుకు 140 నుంచి 150 టన్నుల చెత్త సేకరణ

నగరపాలక సంస్థ పరిధిలోని 89 వేల పైచిలుకు ఇళ్లు, వాణిజ్య సంస్థల సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల నుంచి ప్రతిరోజు 140 నుంచి 150 టన్నుల చెత్తను బల్దియా సేకరిస్తోంది. తడిచెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. పొడిచెత్తను డ్రైబిఫోర్ కలెక్షన్ సెంటర్లకు పంపించి అట్టలు, పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్నారు. 1,020 మంది పారిశుధ్య కార్మికులు, జవాన్లు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రతిరోజు పారిశుధ్య పనులను నిర్వహి స్తున్నారు. 90 స్వచ్ఛ ఆటోలు, 37 ట్రాక్టర్లు, ఐదు స్వీపింగ్ మిషన్లు, ఒక ఎక్స్‌కావేటర్, నాలుగు కంపాక్టర్లు, మూడు డంపర్ బ్లేజర్స్, ఒక జెట్టింగ్ మిషన్, నాలా నుంచి సిల్ట్ తీసే మిషన్, నాలుగు ఫాగింగ్ మిషన్లతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. మొత్తం 300 వాహనాలను పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ఇతర వాహనాల షెడ్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వెంటనే కాలం చెల్లించిన వాహనాలను అమ్మివేయాలని సూచించారు.మరో ఐదుసంవత్సరాల పాటు లైసెన్స్ రెన్యూవల్ చేయించాలని, అవసరమైన మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో ఇన్నాళ్ళు మూలనపడ్డ 32 వాహనాలను మళ్లీ వినియోగంలోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్‌లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

భగత్‌నగర్, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీ గార్డ్స్, వాచ్‌మెన్, స్వీపర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ రాష్ట్ర కన్వీనర్ యాటాల సోమన్న డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ అలైడ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



ఇల్లంతకుంటలో బోనాలతో మహిళలు, సిరిసిల్లలో బోనమెత్తుకున్న మహిళలు

సిరిసిల్ల టౌన్ జూన్ 30: వర్షాలు సమృద్ధిగా కురిపించు.. పిల్లాపాపలను సల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ మహిళలు బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం 15వ వార్డు కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మల బాలరాజు ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వార్డు మహిళలు అంబేద్కర్ చౌరస్తా నుండి పోచమ్మ దేవాలయం వరకు బోనాలు ఎత్తుకొని దేవాలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వార్డు నాయకులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోణాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుల్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు.

● వడుకాపూర్‌లో మడేలేశ్వరస్వామి బోనాలు..

జూలపల్లి: మండలంలోని వడుకాపూర్‌లో ఆదివారం రజక కులస్తుల ఆధ్వర్యంలో వారి ఆరాధ్యదైవమైన మడేలేశ్వరస్వామి బోనాల వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మడేలేశ్వరస్వామి వేడుకలను పురస్కరించుకుని మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించేందుకు డప్పుచప్పుల్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆయలయంలో స్వామివారికి బెల్లం సాకం, నైవేద్యం, సమర్పించి తమ పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. వైస్ ఎంపీపీ మొగురం రమేష్, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్ పాల్గొని బోనాలతో ఆలయాలనికి తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రజక కుల నాయకులు ఎర్రోల్ల రాములు, కూనరాజుల లచ్చన్న, కూనరాజుల రాజన్న, కూనరాజుల శంకరయ్య, మల్లయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


వడుకాపూర్‌లో..

రోడ్డుపైనే మురుగు నీరు.. ఇళ్లలోకి విషపురుగులు

- ఇబ్బందిపడుతున్న ప్రజలు - భయాందోళనలో కాలనీవాసులు



మల్లాపూర్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటిలో నుంచి నడుచుకుంటు వెళుతున్న స్థానికులు, పేరుకుపోయిన మురుగు

తిమ్మాపూర్, జూన్ 30: మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని 5వ వార్డులో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం ప్రారంభం నుంచి శివారు గుట్ట ప్రాంతం వరకు డ్రైనేజీని నిర్మించారు. అయితే గత పాలకుల అధికారుల సహాయంతో స్థానికంగా ఉన్న కొంత వ్యవసాయ భూమిని కొందరు ప్లాట్లుగా చేసి ఎలాంటి నాలా అనుమతులు లేకుండానే విక్రయించారు. అనంతరం ప్లాట్లను కొనుగోలు చేసిన వారు అందులో ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన ప్లాట్లు రోడ్డుకు చాలా లోతుగా ఉండటంతో రోడ్డుకు ఎత్తుగా మట్టితో పూడ్చుతున్నారు. గతంలో మురుగు నీరు అంతా ఓ ఖాళీ ప్రదేశానికి తరలించేవారు. అయితే ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకోవడంతో మురుగు నీరు బయటకు వెళ్లకుండా అడ్డుగా మట్టి పడటంతో రోడ్ల మీద ప్రవహిస్తున్నాయి, దీనికి తోడు ఇప్పుడు వర్షాలు కూడా కురుస్తుండటంతో మురుగు నీరు, వర్షం నీరు కలిసి రోడ్ల మీద నుండి ప్రవహించడమే కాకుండా ఇళ్లలోని వచ్చి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నెలల తరబడి నీరు నిలిచి ఉండటంతో స్థానికంగా దుర్గంధం, దోమల కారణంగా విషజ్వరాలు వస్తున్నాయని అంటున్నారు. అంతేకాకుండా ఇళ్లలోని విష క్రిమికీటకాలు, చెత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని భయంతో కాలం వెళ్లదీస్తున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐదో వార్డులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, వర్షపు నీరు

అధికారులు పట్టించుకోవడం లేదు

- హరికృష్ణ, మల్లాపూర్ గ్రామం



మల్లాపూర్‌లోని ఐదో వార్డులో ఉన్న సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ భూమిని ఎలాంటి నాలా పర్మిషన్ లేకుండానే విక్రయించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఆ ప్లాట్లు రోడ్లుకు లోతుగా ఉండటం వల్ల కిందికి మురికి నీరు వెళ్లకుండా నిలిచిపోయి రోడ్ల పైకి, ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయింది. మురికి కాలువ నీరు, వర్షపు నీరు కలిసి ఇళ్లలోకి వస్తున్నయి. పాములు, కప్పలు, చెత్త ఇళ్లలోకి చేరి దుర్గంధం, దోమలతో ఉండలేకపోతున్నాం. అధికారులకు చాలాసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

ముదిరిన పోడుభూమి వివాదం

- ఇరువర్గాల మధ్య ఘర్షణ

వీర్నపల్లి, జూన్ 30: పోడు భూముల వివాదం ఇరువర్గాల గిరిజనుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు కర్రలతో, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా తలలు పగిలి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన వీర్నపల్లి మండలం భూక్యతండా పరిధిలోని రాసిగుట్ట తండా అటవీ భూముల్లో ఆదివారం సాయంత్రం జరిగింది. అదే గ్రామానికి చెందిన భూక్య సరియా నాలుగెకరాలు, లకావత్ వసంత్ 1.20 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం వీరికి పోడు పట్టాలను అందించింది. ఇద్దరికి సరిహద్దు విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతుండగా గ్రామస్థులు హద్దులను చూపించినా వివాదం సద్దుమనగలేదు. ఆదివారం లకావత్ వసంత్ ఆయన కుమారులు రవి, తిరుపతి, భూక్య సరియా ఆయన కుమారుడు నవీన్, తమ్ముడు మోహన్ సాగు చేసుకుంటున్న భూముల వద్దకు వెళ్లి హద్దుల విషయంలో మాటమాట పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడిలో వసంత్, తిరుపతి, నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల నుంచి ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

దుర్గామాత ఆలయంలో చోరీ


జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చందుర్తి, జూన్ 30: చందుర్తి మండల కేంద్రం శివారులోని నవరత్నాల దుర్గామాత ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆలయ పూజారి మురళి రోజు మాదిరిగానే ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా ఆలయం తాళం పగలగొట్టి ఉంది. వెంటనే పూజారి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. కమిటీ సభ్యులు వచ్చి ఆలయంలోకి వెళ్లి చూడగా దుర్గామాతపై ఉండవలసిన పావు తులం పుస్తెలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జాగిలాలతో చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఈ సంఘటనపై విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎట్టకేలకు 'సూరమ్మ' పనులు ప్రారంభం

● రు. 80 కోట్లు విడుదల చేసిన సర్కారు

● మత్తడి, తూముల పనులు వేగవంతం





పనులు పరిశీలిస్తున్న అధికారులు, కొనసాగుతున్న కట్ట నిర్మాణ పనులు

కథలాపూర్, జూన్ 30: అధికార, ప్రతిపక్షాల మధ్య గడిచిన పదేళ్ల నుంచి హోరాహోరీగా సాగిన వాదనలు, నిరసనల నేపథ్యంలో ఎట్టకేలకు సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయి. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు 80 కోట్ల రూపాయలు విడుదల చేసిన క్రమంలో కాంట్రాక్టర్ ముందుకు రావడం వల్ల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో పడిపోగా ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

● ముమ్మరమైన మత్తడి, తూముల పనులు..

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్ 1, ఫేజ్ 2 లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రు. 1,688 కోట్లతో ప్యాకేజీ కింద పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి సూరమ్మ చెరువును పంపింగ్ ద్వారా నింపాలని ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడ్డ అనంతరం నిధుల కొరత కారణంగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ఈ ప్యాకేజీ పనులను ఐవీఆర్‌సీఈఎల్, ఎస్ఈడబ్ల్యు, నవయుగ కంపెనీలు సంయుక్తంగా చేపడుతున్నాయి. సూరమ్మ ప్రాజెక్ట్‌కు సంబంధించి సబ్‌కాంట్రాక్టర్ పనులు చేపడుతుండగా నిధుల కేటాయింపులో విపరీత జాప్యం వల్ల పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. దీంతో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరో వైపు బీజేపీ శ్రేణులు రకరకాల నిరసనలు చేపట్టారు.

మేడిపల్లి, భీమారం, కథలాపూర్ మండలాల వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ ఉంటే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుట్ల దాకా భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ప్రతీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సూరమ్మ చెరువు ఓ ప్రచారాస్త్రంగా ఉండేది. తమ ప్రభుత్వం రాగానే పనులు ప్రారంభించేలా చేస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇవ్వగా పెండింగ్‌లో ఉన్న రు. 80 కోట్ల నిధులను విడుదల చేయించడంలో సఫలీకృతులయ్యారు.

85 మీటర్ల మేర మత్తడి, పాత తూము తొలగించి మరమ్మతుతో పాటు మరో తూము కొత్తగా నిర్మాణం చేపడుతున్నారు. సూరమ్మ చెరువు గత ఏడాది వర్షాలకు పుష్కలంగా నిండినప్పటికీ మత్తడి కోతకు గురై నీరంతా వృధాగా పోయింది.

● పనులు నిరంతరం కొనసాగిస్తున్నాం..

కార్తీక్, ఏఈ ఇరిగేషన్



ఉన్నతాధికారుల నుంచి పనులు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు రావడంతో పని ప్రదేశం వద్దే ఉండి నిరంతరం పనులు చేపడుతున్నాం. మత్తడి, తూముల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతు న్నాయి. కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులను వెన్సా కంపెనీ సుమారు రు. 199 కోట్లతో దక్కించుకుంది. 524 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోతున్నారు. నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

చట్టవ్యతిరేకంగా శిశువును దత్తత తీసుకున్న దంపతులు

- శిశుగృహకు శిశువు తరలింపు, కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 30: నిబంధనలకు విరుద్ధంగా కేవలం నోటరీ చేయించుకుని ఒక శిశువును దత్తత తీసుకున్న విషయంపై కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి, ఆ శిశువును స్వాధీనం చేసుకుని సంరక్షణార్థం కరీంనగర్ శిశుగృహకు తరలించారు. బాలల సంరక్షణ సమితి అధికారులు, కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంతానం లేనివారు ఎవరైనా జిల్లా బాలల సంరక్షణ సమితికి దరఖాస్తు చేసుకుని ఆ శాఖ ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఆ నిబంధనలు పాటించకుండా కరీంనగర్‌లోని హరిహరనగర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయ దంపతులు వారికి సంతానం లేకపోవటంతో మాతాశిశు ఆసుపత్రిలో జన్మించిన 14 రోజుల శిశువును ఇద్దరు మధ్యవర్తుల సహకారంతో తల్లిదండ్రులతో నోటరీ రాయించుకుని దత్తత తీసుకున్నారు. దీనిపై బాలల సంరక్షణ సమితికి ఫిర్యాదు రాగా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌కు చెందిన ఒడ్డెపల్లి ఆంజనేయులు భార్య గొంటి మౌనికకు జనవరి 31న కరీంనగర్ మాతాశిశు ఆసుపత్రిలో ఆడ శిశువు జన్మించింది. అయితే ఆ శిశువును పోషించే స్తోమత లేదని మాతాశిశు ఆసుపత్రిలోని సెక్యూరిటీగార్డు కక్కర్ల పర్శరాంకు శిశువు తండ్రి తెలిపాడు. ఈ విషయం పర్శరాం అతని స్నేహితుడు చెరుకు రవీందర్‌రెడ్డికి తెలపగా అతడి బావ అయిన లింగాల రాజిరెడ్డి దంపతులకు చెప్పాడు. ఆ శిశువును తాము దత్తత తీసుకుంటామని మధ్యవర్తులు పర్శరాం, రవీందర్‌రెడ్డిలకు తెలపటంతో వారు శిశువు తండ్రి ఆంజనేయులుతో మాట్లాడి అడ్వకేట్ వద్ద నోటరీ రాయించుకుని శిశువును దత్తత తీసుకున్నారు. కొద్ది నెలల తరువాత ఆంజనేయులు తన కూతురు తనకే కావాలని మధ్యవర్తులను అడగడంతో ఈ విషయం బయటకు పొక్కి బాలల సంరక్షణ సమితికి ఫిర్యాదు అందింది. ఈ నెల 29న బాలల సంరక్షణ సమితి అధికారులు శిశువు దత్తత తీసుకున్న దంపతుల వద్దకు వెళ్లి విచారణ జరపగా తాము నోటరీ ద్వారా దత్తత తీసుకున్నామని తెలిపారు. శిశువు దత్తత అనేది నోటరీ ద్వారా చెల్లదని ఆ శిశువును ఆదివారం కరీంనగర్ రెండో ఠాణాకు తీసుకువచ్చారు. శిశువును సంరక్షణార్థం శిశుగృహకు తరలిస్తామని సీఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా శిశువును దత్తత తీసుకున్న రవిందర్, దత్తత ఇచ్చిన దంపతులు, మధ్యవర్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కాగా ఆంజనేయులు తన 14 రోజుల కూతురును దత్తత ఇచ్చేందుకు కొంత మొత్తం డబ్బులు తీసుకున్నట్లు సమచారం. మళ్లీ మరికొన్ని డబ్బులు కావాలని మధ్యవర్తులకు ఫోన్ చేసి వేధిస్తుండటంతో వారు బాలల సంరక్షణాధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారని తెలిసింది.

రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డిని నియమిస్తూ ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఈవోగా పని చేసిన ఆర్‌జేసీ రామకృష్ణ ఆదివారం వరకు విధులు నిర్వర్తించి రిలీవ్‌పై వెళ్లారు. సికింద్రాబాద్ గణేష్ దేవాలయం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న వినోద్‌రెడ్డిని ప్రస్తుతం రాజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 30: మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో ఆదివారం బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన తొట్ల రాజయ్య ఆముదాలపల్లి వారసంతకు కూరగాయల కోసం వెళ్లాడు. ఆముదాలపల్లి క్రాస్ వద్ద రోడ్డు పక్కకు నిల్చుని ఉన్న రాజయ్యను వీణవంక నుంచి కేశవపట్నం వైపు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా: వృద్ధురాలి మృతి

- ఏడుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు



బోల్తాపడిన ఆటో, ఇన్‌సెట్‌లో చంద్రవ్వ మృతదేహం

ఎల్లారెడ్డిపేట, జూన్ 30: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట లో ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఆదివారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన వృద్ధురాలు బొడ్డు చంద్రవ్వ (60) మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజన్నపేట, అల్మాస్‌పూర్ వాసులు ముక్క లక్ష్మి, నమిలికొండ లావణ్య, శివరాత్రి ఇందు, స్వప్న, వాహన డ్రైవర్ బత్తుల రవితో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లి గ్రామం నుంచి 15 మంది ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని డ్రైవర్ బత్తుల రవి అల్మాస్‌పూర్ వైపునకు బయలుదేరాడు. రాజన్నపేట గ్రామంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు చంద్రవ్వ, రాజన్నపేటలోని తన బంధువు ముక్క లక్ష్మితో కలిసి రాజన్నపేటకు ఆటోలో వెళుతున్నారు. ఒక్కసారిగా ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న చంద్రవ్వ, లక్ష్మి, లావణ్య, ఇందు, స్వప్న, వాహన డ్రైవర్ రవితో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో చంద్రవ్వ చనిపోయింది. లక్ష్మి, లావణ్య, ఇందు, స్వప్న, రవితో పాటు మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ బత్తుల రవి మద్యం మత్తులో వాహనాన్ని అతి వేగంగా నడపడంతో ప్రమాదం చోటు చేసుకుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆసుపత్రికి చేరుకున్నారు. గాయాలపాలైన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులను పరామర్శించారు.

తహసీల్దార్, మరో ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

పెద్దపల్లి రూరల్, జూన్ 30: ఓ భూమి విషయంలో ఒక తహసీల్దార్‌తో పాటు మరో ఇద్దరిపై చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు అయింది. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామ మాజీ సర్పంచ్ గర్రెపల్లి విశ్వనాథంకు చెందిన సర్వే నెంబర్ 669లో గల 6 గుంటల భూమిని గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేషం, కారుపాకల సంపత్ కుమార్ పేరున కార్యాలయ ఇన్‌వార్డ్ నెంబర్ ఫైల్ ప్రాసెస్ లేకుండానే అక్రమంగా 2011-12లో అప్పటి తహసీల్దార్ పట్టా చేశారని కోర్టును బాధితుడు ఆశ్రయించాడు. విచారణ అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురుపై పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ ఐపీసీ 420, 468, 471, క్రైం నంబర్ 277/2024 పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు పెద్దపల్లి మండలంలో ఫోర్జరీ, చీటింగ్ కేసు సంబంధించిన విషయాల్లో అధికారులపై కేసు నమోదు అయిన దాఖలాలు లేవు. కోర్టును ఆశ్రయించడం వల్ల తగిన న్యాయం జరిగిందని బాధితుడు హర్షం వ్యక్తం చేశాడు.

తహసీల్దార్, 12 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

పెద్దపల్లి రూరల్, జూన్ 30: ఓ భూమి విషయంలో తహసీల్దార్‌తోపాటు మరో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు అయింది. మండలంలోని పెద్దబొంకూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చిన్నకల్వల గ్రామానికి చెందిన కలువల శంకర్‌కు సర్వే నంబర్ 478/డి లో ఎకరం ఐదు గుంటల భూమి ఉంది. అయితే ఆ భూమిలో నుంచి ఎనిమిది గుంటల భూమిని కల్వల శంకరయ్య పేరును ఇన్‌వార్డు నంబర్ ఫైల్ లేకుండానే అక్రమంగా తహసీల్దార్ పట్టా చేశారని బాధితుడు కలువల శంకర్ పేర్కొన్నాడు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగిన న్యాయం జరగక పోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు శంకర్ తెలిపారు. కోర్టు తీర్పునివ్వడంతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్‌తో పాటు మరో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు అయినట్లు బాధితుడు శంకర్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30: బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంగారం గ్రామశివారులో జరిగింది. ఆదివారం పెద్దపెల్లి మండలం మారేడుగొండకు చెందిన కమటం రమేష్(26) కాల్వ శ్రీరాంపూర్ నుండి మారేడుగొండకు బైక్‌పై వెళుతుండగా గంగారం గ్రామ శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలైనాయి. సంఘటనా స్థలానికి వెళ్ళిన పోలీసులు ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని చావు బతుకుల్లో ఉన్న రమేష్‌ను 108 ద్వారా మెరుగైన వైద్యం కోసం పెద్దపెల్లికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి సన్నిధి





స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచిఉన్న భక్తులు, శ్రీనివాసాచారి దంపతులను స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్

ధర్మపురి, జూన్ 30: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం తోడుగా జేష్ఠ బహుళ నవమి కావడంవల్ల లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులు లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసాచారి దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి వారిని ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి బహుకరించి వారిని సత్కరించారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ ముత్యపు బుచ్చన్న, రాజ్‌కుమార్, శ్రీనివాస్, అర్చకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● సెల్ ఫోన్‌ను భక్తుడికి అప్పగించిన ఉద్యోగి..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఒక భక్తుడు సెల్ ఫోన్ పోగొట్టుకోగా సిబ్బంది వెతికి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ద్వారా ఆదివారం బాధితుడికి అప్పగించారు. నాందేడ్‌కు చెందిన హృదయ్‌నాథ్ దూబె స్థానిక లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం వచ్చారు. ఉదయం దైవ దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో తనకు సంబంధించిన రూ 25,000 విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ సెల్ ఫోన్ సెక్యూరిటీ సిబ్బందికి అభిషేకం మండపంలో దొరకడం వల్ల విచారణ జరిపి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తుడికి అప్పగించారు. భక్తుడు ఆలయ సిబ్బందితో పాటు సీనియర్ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



చెక్ డ్యాం కట్టపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వీణవంక, జూన్ 30: మండలంలోని రామృష్ణాపూర్‌లో వాగులో నిర్మించిన చెక్ డ్యాం కట్ట గతంలో కురిసిన భారీ వర్షలకు తెగిపోవడంతో కట్ట పూర్తిగా తెగిపోయింది. రానున్నా వర్షకాలం దృష్ట్యా కాంట్రాక్టర్ కరకట్ట నిర్మాణం చేపట్టడంతో కట్టకు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మట్టి పోయడంతో ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌పార్మర్ భూమి లెవల్‌కు ఉండడంతో పశువులకు రైతులకు ప్రమాదకరంగా మారిందని తెలిపారు. రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారుల తప్పిదంతో ప్రమాదకరంగా మారిందని తెలిపారు.

ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 30: మండలంలోని కొత్తపల్లి గ్రామం మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు ఒక ఇసుక టిప్పర్, జేసిబిని స్వాధినం చేసుకున్నారు. పోలీసులను గమనించిన టిప్పర్ డ్రైవర్ టిప్పర్‌ను అక్కడే వదిలేసి పారిపోగా టిప్పర్ ను జేసిబిని పట్టుకున్నట్లు డ్రైవర్ సుంచు హర్షవర్ధన్, జేసిబి డ్రైవర్ మారపల్లి సాయి కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎల్ఎండి పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తి అరెస్ట్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 30: పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా దాడికి పాల్పడిన ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ తండాకు చెందిన భూక్య గురుబాబు (30) అనే వ్యక్తిని ఆదివారం ఆరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రటనలో తెలిపారు. నిందితునిపై గతంలో వివిధ పోలీస్‌ష్టేషన్‌లలో 21 కేసులతో పాటు ఒక మర్డర్ కేసు ఉండడంతో రౌడీ షీట్ ఓపెన్ చేశామన్నారు. ఈనెల 26న రాత్రి రామలక్ష్మణపల్లి గ్రామ శివారులోని మానేరువాగులో బాబుకు చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ ప్రశాంత్ ఇసుక నింపుకొని దుబ్బాక వైపు వెలుతున్నాడు. ఈ క్రమంలో నామాపూర్‌చెరువు కట్టపై పోలీసులు ఆ ట్రాక్టర్‌ను పట్టుకోగా ట్రాక్టర్ యజమాని బాబు అక్కడికి చేరుకొని మళ్లీ ట్రాక్టర్ సీజ్‌చేస్తారని వెంటనే ట్రాక్టర్‌ను డ్రైవర్ వద్ద నుంచి తీసుకొని తన ట్రాక్టర్‌కు అడ్డురావద్దని హెచ్చరిస్తూ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సత్యానారాయణను గాయపరిచి పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న బాబును నామాపూర్ శివారులో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 14 కేసులు, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, వేములవాడ టౌన్, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, సిద్దిపేట జిల్లా దుబ్బాక పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులతో పాటు ఒక మర్డర్ కేసులో రౌడీ షీట్ ఓపెన్ చేశామని ఆయన తెలిపారు.

బావిలో పడిన పిల్లిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

సిరిసిల్ల క్రైం, జూన్ 30: సిరిసిల్ల పట్టణంలోని శివాలయం సమీపంలో గల ఓ ఇంట్లోని చేదబావిలో పిల్లి పడింది. పిల్లిని రక్షించుమని ఇంటి యజమాని మోహనమూర్తి ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వచ్చిన అగ్నిమాపక సిబ్బంది బావిలో పడిన పిల్లిని బయటకు తీసి కాపాడారు. రెస్క్యూ చేసిన అగ్నిమాపక సిబ్బందికి ఇంటి యజమాని కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



పెగడపల్లి, జూన్ 30 : పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన ముంజ రాజు (31) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజ రాజు ఈ నెల 26న బతికెపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు రాజు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కొండ చిలువ కలకలం

● భయాందోళనలో ప్రజలు

శంకరపట్నం, జూన్ 30: శంకరపట్నం మండలంలోని కాచాపూర్‌లో ఆదివారం ఇళ్ల మధ్య కొండ చిలువ కలకలం రేపింది. కాచాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయ సమీపంలో మాల కాలనీకి వెళ్లే దారిలో ఆదివారం ఓ కొండ చిలువ పిల్లిని పట్టుకొని మింగుతుండగా ఓ మహిళ ప్రత్యక్షంగా చూసిన సంఘటన జరిగింది. మహిళ తన ఇంటి పక్కన ఉన్న సీసీ రోడ్ వైపు కరివేపాకు కోసం వెళ్తుండగా కొండ చిలువ పిల్లిని పట్టుకున్న ఘటన చూసి భయాదోళనకు లోనైంది. వెంటనే ఆ మహిళ కేకల వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని కొండ చిలువ నోట్లో నుంచి పిల్లిని విడిపించారు. పిల్లి అప్పటికే మృతి చెందింది. స్థానికులు కొండ చిలువను సమీపంలో ఉన్న గుట్టల వద్ద వదిలి పెట్టినట్లు తెలిపారు. కొండ చిలువ గ్రామంలో ఇళ్ల మధ్య కనిపించడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు.

భక్తుల మనోభావాలను గౌరవించేందుకు చర్యలు

- రాజన్న ఆలయంలో కోడెలు ఎంతో ప్రాముఖ్యం గలవి
- సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్





తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను పరిశీలిస్తున్న సీఎం ఓఎస్‌డీ, ఆలయ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఓఎస్‌డీ, ప్రభుత్వ విప్

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి ఎంతో ప్రేమతో నిజ కోడెలు సమర్పించే భక్తుల మనోభావాలను గౌరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా గోశాలలోని కోడెల స్థితిగతులను, పిచ్చి గడ్డిని, సోయాబీన్, పల్లిపిండి, తవుడుతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓఎస్‌డీ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాజన్న ఆలయంలోని గోశాలను సందర్శించానని అన్నారు. రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించే కోడెలు ఎంతో ప్రాముఖ్యత గలవని సీఎం ప్రత్యేకంగా చెప్పడంతోనే సందర్శించినట్టు తెలిపారు. ఇప్పటికే గోశాలను ఎండోమెంట్ కమిషనర్ విజిట్ చేశారని, నాలుగు వందలు ఉండే గోశాలలో 1500 పైగా కోడెలు ఉంటున్నాయని అన్నారు. కొంత అనారోగ్యం కారణంగా కోడెలు మృతి చెందుతున్నాయన్నారు. బురద నీరు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం, కొత్త షెడ్డుల నిర్మాణాల కోసం ఆదేశాలు జారీ అయ్యాయని అన్నారు. గోశాల ఆధునికీకరణ కోసం మరిన్ని నిధులు వేచ్చిస్తున్నామని, కోడెల సంరక్షణ కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గోశాలలోనే కోడెలను రైతులకు అందించేందుకు ప్రయత్నం జరుగుతుందని అన్నారు. గోశాలకు పర్మినెంట్‌గా వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

● ఆలయ అభివృద్ధికి సీఎం పట్టుదలతో ఉన్నారు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఐదు నెలల క్రితమే రాజన్న ఆలయం, గోశాల అభివృద్ధి కోసం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో గతంలో వెనక్కి వెళ్లిన వీటీడీఏ నిధులు రూ. 20 కోట్లు తిరిగి తెప్పించామన్నారు. ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరిగిందని అన్నారు. రాజన్న కోడె మెక్కులు చెల్లించుకునే భక్తులు ఆరోగ్యంగా, పాలు మరిచిన, నిర్ణీత వయస్సు నిండిన కోడెలను మాత్రమే సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, రావేశ్వరావు, ఏఈవో ప్రతాప నవీన్, హరికిషన్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సూపరిండెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, తిరుపతిరావు, నటరాజ్, నాగుల మహేష్, ఎడ్ల శివసాయి తదితరులు ఉన్నారు.

● రాజన్నను దర్శించుకున్న సీఎం ఓఎస్‌డీ

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. రాజన్న దర్శనానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయానికి విచ్చేయగా ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం స్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో రామకృష్ణ రాజన్న ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

ఘనంగా డాక్టర్స్ డే



మాట్లాడుతున్న డాక్టర్ శ్యాంకుమార్

సుభాష్‌నగర్, జూన్30: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆదివారం రేకుర్తిలోని రాజశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు సీనియర్ వైద్యులను సన్మానించారు. పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డితోపాటు నగరంలోని వైద్యులు పాల్గొన్నారు.

●వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యులు దేవుడి మరో అవతారమని భగవతి విద్యాసంస్థల అధినేత బి రమణారావు అన్నారు. ఆదివారం వాసవీ వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో భగవతి పాఠశాలలో డాక్టర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమాదేవి, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శృతి, డాక్టర్ రమ్య, డాక్టర్ సౌమ్య, డాక్టర్ కె సతీష్‌కుమార్, డాక్టర్ ఝాన్సీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం స్వరూప, ఉపాధ్యక్షురాలు విశాల, జాయింట్ సెక్రెటరీ హరిణి, ప్రిన్సిపాల్ బి విజయలక్ష్మీ, రాజమణి, తిరుపతమ్మ, మంజు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగింపుపై మేయర్ హర్షం

కరీంనగర్ టౌన్, జూన్ 30: స్మార్ట్‌సిటీ మిషన్ గడువును మార్చి 2025 వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల మేయర్ యాదగిరి సునీల్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు మేయర్ ధన్యవాదాలు తెలిపారు. గడువు పొడగింపుతో మిగిలిన 20శాతం పనులు పూర్తయి కరీంనగర్ స్మార్ట్‌సిటీగా రూపొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రిగా సంజయ్ కుమార్ నగర అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకురావాలని కోరారు.

● నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సిటీ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినిమాటిక్ ఎడిటింగ్ ఫొటోగ్రఫీ కంపోజిషన్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ సునీల్‌రావును అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు.

ప్రజల ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్స్ నిర్మాణం

కరీంనగర్ టౌన్, జూన్ 30: నగర ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా తమ పాలకవర్గం పార్కులు, వాకింగ్ ట్రాక్స్, ఓపెన్ జిమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆన్‌స్టాలేషన్, కెబినెట్ సమావేశానికి మేయర్ సునీల్‌రావు ముఖ్యఅతిథిగా, కశ్మీరుగడ్డ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హాజరయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 23 వాకర్స్ అసోసియేషన్ కార్యవర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, డిస్ట్రిక్ట్ గవర్నర్ బాడీ మెంబర్ ఎల్లగౌడ్, కో ఆర్డినేటర్ అన్నమనేని సుధాకర్‌రావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ జగదీశ్వర్‌గౌడ్, డిప్యూటీ గవర్నర్ గొట్టెముక్కుల రవీందర్, రమణారెడ్డి, గౌతమ్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌ను మూసివేయాలి'

భగత్‌నగర్, జూన్ 30: ఫుడ్ పాయిజన్‌కు కారణమైన శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌ను మూసివేయాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి, కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కరీంనగర్‌లోని మంకమ్మతోట శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌లో విద్యార్థులు తిన్న ఫుడ్ పాయిజన్ కావడం వల్ల విద్యార్థులకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ హాస్టల్‌లు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్, నగర కార్యదర్శి చెంచల మురళి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్ నగర కార్యదర్శి వినయ్‌సాగర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కవులకు సాహిత్య పురస్కారాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 30: సిద్దిపేటకు చెందిన శ్రీవాణి సాహిత్య పరిషత్తు దశమ వార్షికోత్సవం సందర్భంగా 2024 సంవత్సరానికి గాను 2023లో ప్రచురితమైన సాహిత్య పురస్కారాలను ఆదివారం సిద్దిపేట శివానుభవ మంటపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కవులు పెనుగొండ బసవేశ్వర్ రచించిన 'ప్రశ్నను మింగిన కాలం' పుస్తకానికి కవిత్వ విభాగంలో, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 'బాలగేయ సారస్వతం' పుస్తకానికి బాల సాహిత్య విభాగంలో పురస్కారాలు దక్కాయి. ఇరువురు కవులకు నగదుతో పాటు శాలువా, జ్ఞాపికలను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు పెందోట వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్కలలో పోచమ్మ బోనాలు

మానకొండూర్, జూన్ 30: మండలంలోని కొండపల్కల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఆదివారం నిర్వహించారు. గౌడ సంఘం మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలతో నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ తిరుపతి, కొంరెల్లి, మొగిలి, రాములు, సంపత్, కనుకయ్య, భూమయ్య, గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

హుజూరాబాద్, జూన్ 30: హుజూరాబాద్ పట్టణంలోని 36వ బూత్‌లో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. అనంతరం పట్టణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, దేవేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, రమేష్, సాయిరెడ్డి, రమణాచారి, దేవేందర్‌రెడ్డి, దేవేందర్, ఓదెలు, శ్రీకాంత్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని 179వ బూత్‌లో ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రధాని మోదీ ప్రతీ నెల చివరి ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి అనేక కొత్త విషయాలు తెలియజేశారని పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ అన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమములో జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, పల్లపు రవి, మోతే స్వామి, మదు యాదవ్, అశోక్, ప్రవీణ్, రవిందర్, మహేందర్, బొజ్జ శరత్, సులోచన, కనమల లక్ష్మి, షైన భాగ్య, స్వరూప పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల శ్రమదానం

శంకరపట్నం, జూన్ 30: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో నల్ల నీరు కోసం పైపులు వేసుకోవడానికి రోడ్డుకు అడ్డుగా తవ్వగా ఏర్పడిన గుంతలను ఆర్టీసీ బస్టాండ్ ఆటో యూనియన్, అంబేద్కర్ చౌరస్తా కేశవ ఆటో యూనియన్ సభ్యులు పూడ్చారు. ఈ సందర్భంగా కేశవపట్నంలో దారికి అడ్డుగా పైపులైన్‌ల కోసం తీసిన గుంతలను సరిగా పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సిమెంట్, కంకర, ఇసుకతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుంకరి కిశోర్, రషీద్, మజ్జు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఒకేచోట చేరిన పూర్వవిద్యార్థులు

చొప్పదండి, జూన్ 30: చొప్పదండిలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది,చొప్పదండి జడ్పీ హైస్కూల్ 2002-03 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అంతా ఓకే చోట చేరి గత స్మృతులను గుర్తుకు చేసుకున్నారు, ఈ సందర్భంగా ఆనాటి గురువులను సన్మానించారు.

ఉపాధిహామీ పథకంలో తోటలు

-పొలం గట్లపై పండ్ల మొక్కల పెంపకం -మండలంలో 50ఎకరాల లక్ష్యం

కరీంనగర్ రూరల్, జూన్30: ఉపాధి హామీ పథకం కింద రైతులకు లాభాలు చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది ప్రభుత్వం. రైతులకు పొలం గట్లపై పండ్ల మొక్కల పెంపకం చేపట్టి అదనంగా ఆదాయాన్ని సమకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పండ్ల మొక్కల పెంపకానికి నిర్వహణ ఖర్చులను ఉపాధిహామీ పథకం ద్వారా చెల్లించాలని నిర్ణయించారు. కరీంనగర్ రూరల్ మండలంలో ఈపథకాన్ని అమలు చేసేందుకు 50ఎకరాలను లక్ష్యంగా పెట్టుకున్నారు.



చామనపల్లిలో రైతుల పొలంలోని ఆయిల్‌పాం చెట్లు

పంట పొలాల్లో పండ్ల మొక్కలను పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉపాధి హామీ పథకంలో రైతులు పొలం గట్లపై పండ్ల మొక్కలు నాటి రైతులకు లాభాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో రైతుల పొలంగట్లపై టేకు మొక్కలను నాటిన స్థానంలో ప్రస్తుతం పండ్ల మొక్కలు నాటాలని నిర్ణయించారు. కొబ్బరి, మునగ, ఆయిల్‌పాం, డ్రాగన్ ఫ్రూట్స్, జామా, మామిడి పెంచె అవకాశం కల్పించారు. మండలంలోని బహదూర్‌ఖాన్‌పేట, మొగ్దుంపూర్, ఇరుకుల్ల, గోపాల్‌పూర్, తహెర్‌కొండాపూర్, దుర్శేడ్ గ్రామాలలో 25ఎకరాలలో పండ్ల తోటలు సాగు చేసేందుకు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన చిన్న, సన్నకారు రైతుల నుండి అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రస్తుతం రైతుల పొలాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు చేప ట్టారు. తహెర్‌కొండాపూర్‌లోని రైతు పొలంగట్టుపై కొబ్బరి మొక్కలను నాటారు. మండలంలోని 17గ్రామాల పరిదిలోని నర్సరీలలో పండ్ల మొక్కలను పెంచుతున్నారు. దుర్శేడ్, ఎలబోతారం, నల్లగుంటపల్లి గ్రామాలలోని నర్సరీలలో మునగ మొక్కలు పెంచుతుండగా మిగతా నర్సరీలలో దానిమ్మ, జామా, అల్లనేరడు, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలం మొక్కలు పెంచుతున్నారు. కాగా మొక్కలకు నిర్వహణ ఖర్చు కింద ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు ప్రతి నెల నిర్వహణ ఖర్చు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. కొబ్బరి మొక్కకు ప్రతి నెల 15 రూపాయలు, డ్రాగన్ ఫ్రూట్‌కు 10 రూపాయలు, మునగకు 5రూపాయలు, మామిడి 25, బత్తాయి 25, ఆయిల్‌ఫాం 12, నిమ్మ మొక్కకు 12 రూపాయల చొప్పున ప్రతి నెల నిర్వహణ ఖర్చు అందిస్తారు. పండ్ల మొక్కలు కొనుగోలు నుండి పెంపకం వరకు నిర్వహణ ఖర్చులను రైతులకు చెల్లిస్తారు. రైతులు ఒక ఎకరంలో అధికారులు సూచించిన మొక్కలు మాత్రమే పెంచాలి. ప్రభుత్వం గుర్తించిన నర్సరీలలో మొక్కలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఎకరంలో మునగ మొక్కలు 1000, కొబ్బరి ఎకరానికి గట్లపై 40, డ్రాగన్‌ఫ్రూట్స్ అరెకరంలో 90, ఆయిల్‌పాం, మామిడి ఎకరంలో 57మొక్కలను నాటాల్సి ఉంటుంది. మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో గుంతలు తవ్వించడం, మొక్కలు నాటించడం పనులను చేయిస్తారు. మునగ మొక్కల నిర్వహణకు ఏడాదికి ఖర్చులు ఇవ్వనుండగా మిగతా మొక్కలకు నిర్వహణ ఖర్చులను మూడేళ్ళ పాటు చెల్లిస్తారు.

● రైతులు ఆసక్తి చూపుతున్నారు

శోభారాణి, ఉపాధిహామీ ఏపీవో



రైతులకు అదనంగా ఆదాయాన్ని అందించే పండ్ల మొక్కలు నాటేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో 50ఎకరాల్లో నాటేందుకు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 25ఎకరాలను గుర్తించాం. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలి.

శ్రీవైష్ణవ సంఘ బలోపేతానికి కృషి

కరీంనగర్ కల్చరల్, జూన్ 30: రాష్ట్ర వ్యాప్తంగా శ్రీవైష్ణవ సంఘ బలోపేతానికి కృషి చేయాలని గాయకుడు, సంగీత దర్శకుడు కొమాండూరు రామాచారి అన్నారు. శనివారం రాత్రి ఫిలింభవన్‌లో కలకుంట్ల సంపత్కుమారాచార్య స్మారక రాష్ట్ర స్థాయి సంగీత పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా ఆయన కరీంనగర్‌కు వచ్చారు. రాష్ట్ర శ్రీవైష్ణవ సంఘం వజ్రోత్సవాలను పురస్కరించుకొని జిల్లా శ్రీవైష్ణవ సంఘం బాధ్యులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్య, కెఎస్ అనంతాచార్య, ఆచి యాదగిరి ఆచార్య డింగరి శ్రీనివాసాచార్యులు, పీచర నరసింహాచార్యులు, కాందూరి వేంకటేశ్వర్లు, కలకుంట్ల వేదాంతాచార్యులు, రామకృష్ణమా చార్యులు, శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ రూరల్, జూన్30: స్థానిక మంకమ్మతోటలోని పారమిత పాఠశాల నాలుగో తరగతి విద్యార్థులు కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి గ్రామంలో క్షేత్ర పర్యటన కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. క్షేత్రస్థాయి పర్యటనలు పిల్లల మనోవికాసానికి, అనుభవపూర్వమైన అభ్యాసాన్ని అందిస్తుందని చైర్మన్ ప్రసాద్‌రావు తెలిపారు. ఈ పర్యటనలో సమన్వయ కర్త శ్వేత పాల్గొన్నారు.

ధరణి సమస్యలకు పరిష్కారం చూపాలి

సుభాష్‌నగర్, జూన్ 30: ధరణి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటివ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కోరారు. ఆదివారం ధరణి కమిటి చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి అమల్లోకి వచ్చిన తరువాత 1971 ఆర్‌వోఆర్ యాక్ట్‌ను రద్దు చేశారని దాంతో రెవెన్యూ వ్యవస్థ మొత్తం కుప్పకూలిందన్నారు.

6నుంచి శాకాంబరి నవరాత్రి ఉత్సవాలు

కరీంనగర్ రూరల్, జూన్30: ఆషాడమాసం సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గాభవాని ఆలయంలో ఈనెల 6నుంచి 21 వరకు ఆషాడ శాకాంబరి నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ తెలిపారు.

'గృహజ్యోతి' నమోదులో లోపాలు

-ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న అర్హులు

గణేశ్‌నగర్, జూన్30: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం అరులందరికి అందడం లేదు. డేటా ఎంట్రీ సందర్భంగా ఆపరేటర్లు చేసిన తప్పిదాలు అర్హుల పాలిట శాపంగా మారాయి. ప్రభుత్వం ప్రకటించిన మేరకు అన్ని అర్హతలున్నా 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా పొందే అవకాశం చాలామంది కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 8 నుంచి ఈ ఏడాది జనవరి 6 వరకు ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుల్లో పథకాల లబ్ధి కోసం టిక్ పెడితే చాలు అని చెప్పడంతో దరఖాస్తుదారులు అదే పని చేశారు. డేటా నమోదులో కొన్ని పొరపాట్లు జరిగి గృహలక్ష్మి పథకానికి నాట్ అప్లయ్ అని ఎంట్రీ చేశారు. ఆ దరఖాస్తుదారులందకీ గృహలక్ష్మి పథకం అందడం లేదు. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో పొరపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోయింది. ఓ వైపు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తుండగానే అధికార యంత్రాంగం ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించి జనవరి 5 నుంచి డేటా ఎంట్రీ మొదలుపెట్టింది. వేగంగా డేటా ఎంట్రీ చేయాలని ఆదేశించడంతో ఆపరేటర్లు పొరపాట్లు చేశారు. చాలామందికి గృహజ్యోతి పథకం వర్తించడం లేదు. ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేసి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. సిబ్బంది ఎడిట్ ఆప్షన్ లేదని చెప్పడంతో అర్హులు నిరాశ చెందుతున్నారు. అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కరీంనగర్ కల్చరల్, జూన్ 30: నగరంలోని జ్యోతినగర్, వేంకటాద్రి కాలనీ మహాలక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి చతుర్థ వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం నిత్య పూజలు, పద్మశాలీయుల సమాజం తరపున అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ భూదాతలు దేశ బోయిన వంశ కుటుంబ సభ్యులు, ఆలయ అధ్యక్ష, కార్య దర్శులు వేంకటేశ్వర్లు, వేదం, ఉపాధ్యక్షుడు గోపాలరావు, ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

●అమ్మవార్లకు సారె సమర్పణలో ఆర్డీవో కుందారపు మహేశ్వర్, కాళేశ్వరం ప్రాజెక్ట్ మాజీ ఈఎన్‌సీ నల్ల వేంకటేశ్వర్లు, జిల్లా, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, గడ్డం శ్రీరాములు, పోపా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎలిగేటి మల్లికార్జున్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ ఆడెపు శ్రీనివాస్, జిల్లా యువజన పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార ఆడిట్ అధికారి

శంకరపట్నం, జూన్ 30: మండలంలోని మెట్‌పల్లి, గద్దపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో రైతు భరోసాపై ఆదివారం రైతుల అభిప్రాయాలు సేకరిం చారు. ఈ సందర్భంగా ఆయా సొసైటీలలో రైతు భరోసాలో భాగంగా రైతుబంధుపై రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి మనోజ్‌కుమార్, నోడల్ అధికారి శ్రీనివాస్, ఏవో శ్రీనివాస్, చైర్మన్లు తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ కాల్వ పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు, సీఈవోలు నదయ్య, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్ సహకార సంఘం ప్రత్యేక సమావేశం ఆదివారం సంఘం ఆవరణలో జరిగింది. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు నల్ల గోవిందరెడ్డి సభాధ్యక్షత వహించారు. పది ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు రైతు భరోసా అందజేసి, పనికిరాని భూములకు రైతు భరోసాను నిలిపివేయాలని తీర్మానం చేశారు. పాసుబుక్కును యానిట్‌గా తీసుకొని వ్యవసాయేతర భూములకు రైతు భరోసాను నిలిపివేసి అర్హులైన రైతులందరికి రైతు భరోసాను వర్తింపజేయాలని సమావేశ తీర్మానం చేసింది. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు, సిబ్బది పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకర సంఘంలో ఆదివారం రైతు భరోసా అమలుపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం చైర్మన్ మావురపు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండలంలోని రైతులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. రైతు భరోసా పథకం 10 ఎకరాల లోపు రైతులకు అందివాలని, ఐటీతో సంబంధం లేకుండా రైతు భరోసా పథకం అమలు చేయాలని రైతులు తమ అభిప్రాయం తెలిపారు. రైతులు పలు సమస్యలు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కార్యక్రమంలో సహకార శాఖ చీఫ్ అడిటర్ చెరుకు మనోజ్‌కుమార్, సీనియర్ అడిటర్ మంజుల శ్రీనివాస్, సంఘం చైర్మన్ మావురపు విజయ బాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు చెక్కబండి శ్రీనివాస్‌రెడ్డి, ముదిగంటి శ్యాసుందర్‌రెడ్డి, మద్గూరి సమ్మిరెడ్డి, గెల్లు మల్లయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

సైదాపూర్, జూన్ 30: పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పెంచాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాసాడి ముత్యంరావు అన్నారు. ఆదివారం డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ పురస్కరించుకొని మండలంలోని రాములపల్లిలో బీజేపీ మండలాధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముత్యంరావు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండల నాయకులు డాక్టర్ శ్యామాప్రశాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మొక్కలను నాటారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కళ్యం వాసుదేవారెడ్డి, పొన్నం శ్రీనివాస్, ఎంపీటీసీ రవీందర్, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీనివాస్ ఉన్నారు.

'రైతు భరోసా'ను వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ

చొప్పదండి, జూన్ 30: వ్యవసాయ పనులు ప్రారంభమైనందున రైతుభరోసాను వెంటనే విడుదల చేయాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. ఆదివారం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు పెట్టుబడికి డబ్బులు అవసరం ఉంటాయని రైతుభరోసాను విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రాగంపేటలో ఇంకుడు గుంతలను నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించలేదని ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే రోడ్డుకు నిధులు మంజూరైనప్పటికీ పనులను ఎందుకు ప్రారంభించడంలేదని సభ్యులు అడిగారు. చాకుంటలో వైకుంఠధామానికి విద్యుత్ సరఫరా చేయడం లేదని ఎంపీటీసీ గొప్ప మంగమ్మ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

కాగా ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుండగా అధికారులు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, తహసీల్దార్ నరేందర్, ఎంపీవో రాజ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

శంకరపట్నం, జూన్ 30: యువత, విద్యార్థు లు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాని కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కేశవపట్నంలో యువతకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మారెడ్డి మాట్లాడు తూ బ్యాంకు లావాదేవీలు వ్యక్తిగత సమాచారం అపరిచితులతో పంచుకోవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు లాటరీలు బహుమతులు వచ్చాయని వివిధ కారణాలు చెప్పి వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించే ప్రయత్నం చేస్తారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను సమాచారం ఇవ్వకూడదన్నారు. ఫోన్‌లో అవసరమైన సైట్లను వినియోగించకూడదన్నారు. యువత మాదకద్రవ్యాలకు, వ్యసనాలకు దూరంగా ఉండి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలన్నారు.



శంకరపట్నంలో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూన్ 30: నగరంలో సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు వివిధ ప్రాంతా లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. సంతోష్‌నగర్, భాగ్యనగర్, కొత్త లేబర్ అడ్డా, శివ థియేటర్ ప్రాంతం, గీతాభవన్ వెనుక వైపు, జ్యోతినగర్, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

రామారావుకు ఘన నివాళి

గణేశ్‌నగర్, జూన్ 30: నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి జిల్లా ప్రథమ కోఆర్డినేటర్, మాజీ రీజినల్ డైరెక్టర్ వేముగంటి రామారావు సంస్మరణ సభను ఆదివారం నెహ్రూ యువ కేంద్ర సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర కరీంనగర్ జిల్లా యువజన అధికారి ఏం.వెంకట రాంబాబు మాట్లాడుతూ రామారావు లక్ష్యసాధన కోసం నెహ్రూ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ఉమ్మడి జిల్లా యూత్ కో-ఆర్డినేటర్ టీవీ విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 30: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్ జిల్లాలో ఈనెల 1 నుంచి 10 వరకు జరగనున్న థల్‌సైనిక్ అంతర గ్రూపు ఫైరింగ్ పోటీలకు నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల గజ్వేల్‌లో నిర్వహించిన తెలంగాణ బెటాలియన్ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లు సిహెచ్ సాయి వీక్షిత్, రాచమల్ల త్రిదేవ్, దుగ్గ సాహిత్‌లు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజి తెలిపారు. ఈ సందర్భంగా క్యాడెట్లను పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేశ్, రశ్మిక, అనూకర్‌రావు, వినోద్‌రావు, రమణ, ప్రసాద్, హన్మంతరావు, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ డానియల్ లాట్టమ్, ప్రశాంత్, రమేశ్ అభినందించారు.

టీం ఇండియాది చరిత్రాత్మక విజయం

భగత్‌నగర్, జూన్ 30: టి-20 వరల్డ్‌కప్‌లో టీం ఇండియాది చరిత్రాత్మక విజయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో విద్యార్థులతోకలిసి విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్, జూన్ 30: తెలంగాణ ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక నాలుగవ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన టివివి వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లు చంద్రప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పోలీస్ హౌజింగ్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ కోలేటీ దామోదర్ హాజరై ప్రసంగించారు. ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషి చేయాలని, పేద ఆర్యవైశ్యులకు చేయూతనివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం చైర్మన్ బుస్స శ్రీనివాస్, ఆవోపా రాష్ట్ర నాయకుడు గంజి స్వరాజ్‌బాబు, పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ ఉప్పల రామేశం, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు కటకం భూమయ్య నాయకులు సిరిపురం శ్రీనివాస్, కొమురవెల్లి సుధాకర్, మాడిశెట్టి గోపాల్, రాచమల్ల భద్రయ్య, గోగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రస్తుత కమిటీని కొనసాగిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.

శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ జయంతి

భగత్‌నగర్, జూన్30: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతిని నగరంలోని పశ్చిమజోన్ 17వ డివిజన్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్రపార్టీ పిలుపు మేరకు చెట్లు నాటారు. ఈకార్యక్రమంలో బీజేపీ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

●ప్రధాని నరేంద్రమోదీ మన్‌కిబాత్ కార్యక్రమాన్ని బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వీక్షించారు. ఈకార్యక్రమంలో తిరుమల్‌రెడ్డి, అబ్బిడి మాధవరెడ్డి, బండరాకేష్, శీతల రమేష్‌చంద్ర పాల్గొన్నారు.

● 37వ డివిజన్‌లో బీజేపీ నాయకులు జానటప్ల స్వామి, గాజర్ల శ్రీకాంత్, కత్రోజు శ్రీపాల్, కత్రోజు నితిన్, మార్చు వెంకటేశ్వర్‌రెడ్డి, దాసరి రాజులు మన్‌కీ బాత్‌కార్యక్రమాన్ని వీక్షించారు.

సీపీకి ఫిర్యాదు చేసిన కిరాణావర్తక సంఘం అధ్యక్షుడు

హుజూరాబాద్, జూన్ 30: హుజూరాబాద్ పట్టణంలో గతంలో కిరాణా వరక్త సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన చందాగాంధీపై సీపీ అభిషేక్ మొహంతికి ఆదివారం ఫిర్యాదు చేసినట్లు నూతన అధ్యక్షుడు శీల రాజేంద్రప్రసాద్ తెలిపారు. హుజూరాబాద్‌లో కిరాణా వర్తక సంఘానికి సంబంధించిన షెటర్ల కిరాయితో పాటు ఇతర నిధులు రూ. 9లక్షలు మాజీ అధ్యక్షుడు చందాగాంధీ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఆ నిధుల లెక్కలు చూపాలని సంఘం సభ్యులు పలుసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయంపై 2023 ఫిబ్రవరిలో హుజూరాబాద్ సీఐకి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో సంఘానికి రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని సంఘం అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ సీపీ అభిషేక్ మొహంతిని కోరారు.

గన్నేరువరం వాసికి వరల్డ్ లియో మెంబర్‌షిప్ అవార్డు

గన్నేరువరం, జూన్ 30: మండల కేంద్రానికి చెందిన డిస్ట్రిక్ లియో చైర్‌పర్సన్ బూర శ్రీనివాస్ వరల్డ్ లియో మెంబర్‌షిప్‌లో వరల్డ్ ఛేజింగ్ నంబర్ వన్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ మల్టిపుల్ 320 డిస్ట్రిక్‌లో 2023-24 గాను అందుకున్నట్లు బూర శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డుల పంపిణీ

హుజూరాబాద్, జూన్ 30: హుజూరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం అత్యున్నత ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ప్రగతి చక్రాల పురస్కార ప్రధానోత్సవంలో భాగంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడంతో పాటు అవార్డు సాధనకు పోటీ పడాలన్నారు. అప్పుడే సంస్థ లాభాల బాటలో ప్రయాణిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా చైర్మన్‌కు సన్మానం

ఇల్లందకుంట, జూన్ 30: మండలానికి చెందిన పిట్టల రవీందర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైనందున శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, కేడీసీసీ బ్యాంకు జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్‌లు కరీంనగర్‌లో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యశాఖ సహకార సంఘాల అన్నింటిని జిల్లా స్థాయిలో బాధ్యత రావడం అనేది గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పండుగ బాలు, జేకే, చిరంజీవి, సురేష్, ప్రశాంత్, చరణ్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.